

- రుద్రభూమిలో వసతుల కరువు
- రూ.1.60 కోట్లు మంజూరైనా సాగని పనులు
- హిందూ శ్మశానవాటికలో అన్నీ కష్టాలే
- పందుల స్వైర విహారం
- పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్న వైనం

ఆఖరి మజిలీకీ అవస్థలే

ఆ రుద్రభూమిలో ఆఖరి మజిలీకీ అవస్థలే. శిథిలమైన సీసీ రోడ్డు, ఎప్పుడు కూలుతాయో తెలియని స్థితిలో దహనం చేసే షెడ్లు.. చుట్టూ పిచ్చి మొక్కలు, మద్యం బాటిళ్లు, చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వాటిలో పందులు సంచరించడంతో దుర్వాసన భరించలేక మృతదేహం వెంట వెళ్లే వారు నరకం చూస్తున్నారు. రూ.1.60 కోట్లతో అభివృద్ధి చేయాలని మాస్టర్‌ప్లాన్ రూపొందించినా పనులు ముందుకు సాగకపోవడంతో సమస్యలు మరింత రెట్టింపు అవుతున్నాయి.

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లపాలెంలో కోరమాండల్‌కు సమీపంలో సుమారు 3 ఎకరాల విస్తీర్ణంలో హిందూ శ్మశాన వాటిక ఉంది. సింధియా నుంచి జింక్ వరకూ అంటే జీవీఎంసీ 40,58,59, 60,61,62,63వ వార్డుల పరిధిలో ఎవరైనా మరణిస్తే వారిని ఈ శ్మశాన వాటికకు తీసుకు వచ్చి దహన కార్యక్రమాలు చేస్తారు.

అసౌకర్యాల నెలవు

సుమారు వంద ఏళ్ల చరిత్ర ఉన్న శ్మశాన వాటిక అసౌకర్యాలతో ఉంది.ఆఖరిమజిలీ యాత్రతో వచ్చే వారు అత్యవసరమైతే అవస్థలు పడాల్సిందే. మరుగుదొడ్ల సదుపాయం,మంచినీటి సౌకర్యం లేదు. మృతదేహాలను దహనం చేసేందుకు ఏర్పాటు చేసిన షెడ్లు పాడయ్యాయి. మృతదేహాలతో తీసుకువచ్చే వస్త్రాలు, పండ్లు ఇక్కడ నిర్లక్ష్యంగా డంప్ చేయడం,వాటిని నెలల తరబడి తొలగించకపోవడంతో అంతా దుర్వాసన వెదజల్లుతోంది. పశువులు,పందులు చేరి ఆవరణను మరింత చెత్తగా మార్చుతున్నాయి. పందులు గుంపుగా చుట్టిముట్టి పదార్థాలను భుజించడంతో పాటు పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి.



శ్మశానంలో పందుల సంచారం



శ్మశానవాటికలో అసౌకర్యాల నడుమ దహనం చేస్తున్న దృశ్యం

అభివృద్ధి పనులకు మోక్షమెప్పుడో!

శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు చేపట్టాలని రూ.1.60 కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఏఏ పనులు చేపట్టాలో పేర్కొన్నారు.గతేడాది నవంబర్‌లో అభివృద్ధి పనులు జరుగుతాయని ప్రచారం చేశారు.కానీ నేటికీ మోక్షం కలగలేదు. అభివృద్ధి పనులకు ఎప్పుడు మోక్షం కలుగుతుందో ఆ దేవుడికి,కూటమి నాయకులే తెలియాలని ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.



మాస్టర్ ప్లాన్ ఇదే

సమస్యలు స్వాగతం



"కోరమాండల్ వద్ద గల హిందూ శ్మశానవాటికలో కనీస సౌకర్యాలు లేకపోయినా అధికారులు ఏం చేస్తున్నారో తెలియడం లేదు. రుద్రభూమిలో అడుగు పెడితే చాలు సమస్యలు స్వాగతం పలుకుతాయి. శ్మశానంలో పందుల సంచారం మరింత ఇబ్బందికరంగా ఉంది.తక్షణమే అభివృద్ధి పనులు ప్రారంభించాలి."

– లక్కరాజు రామకృష్ణ, బీజేపీ నాయకుడు

వసతులు కల్పించాలి



"కోరమాండల్ వద్ద గల శ్మశానవాటికలో వసతుల లేక ఇబ్బంది పడుతున్నాం. శ్మశాన వాటికలో వసతులు కల్పించాలని, చుట్టుపక్కల పరిసరాలను నిత్యం పరిశుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని పలు మార్లు అధికారులకు వినతులు ఇచ్చాం. అయినా వారు కనీసం స్పందించకపోవడం బాధాకరం. ఇప్పటికైనా శ్మశానవాటికలో వసతులు కల్పించాలి."

–ఉరుకూటి బాబూరావుయాదవ్, మల్కాపురం గ్రామ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, ఆలయ ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

మర్రిపాలెం రైతు బజారులో స్వచ్ఛభారత్



పరిసరాలను శుభ్రం చేస్తున్న రైతులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం రైతు బజారులో ఆదివారం రైతులంతా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. రైతు బజారు ఎస్టేట్ అధికారి డి. నారాయణరావు ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్రాంగణంలోని చెత్తా చెదారం, ఖాళీ స్థలంలో ఉన్న గడ్డి, పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో రైతు బజారు సహాయకుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖవ్యాలీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

ఆరిలోవ: విశాఖ వ్యాలీ పాఠశాలలో ఆదివారం మిలాన్–2025 పేరుతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 1968 నుంచి 2023 సంవత్సరం వరకు చదువుకున్న విద్యార్థులంతా ఒకేచోట కలిశారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరీప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన వీరి కలయికకు అదే పాఠశాల వేదిక కావడం విశేషం. నగరంలో ఉన్న కొందరు పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమం నిర్వహణకు నడుంబిగించారు. దీంతో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా పాఠశాలలో సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆలింగనం చేసుకొన్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. చదువుకున్న రోజులను జ్ఞాపకం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఈశ్వరీ ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలలో 3,800 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. వీరికి పూర్వవిద్యార్థులు ఆదర్శంగా నిలవాలన్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘం ప్రమాణ స్వీకారం

ఎంవీపీకాలనీ: అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఎంవీపీ కాలనీలోని గిరిజన భవనంలో జరిగింది. సంఘ సభ్యుల సమక్షంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు సొనాయి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కటారి శోభన్‌కుమార్ తదితరులు బాధ్యతలు స్వీకరించారు. సంఘ సభ్యులైన గిరిజన ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధికి చిత్తశుద్ధితో సేవలు అందిస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు. అనంతరం ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు అభినందించారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి

- 22 ఏ భూములపై పూర్తి స్థాయిలో తనిఖీలు
- ఇళ్ల పట్టాలపై ఉన్నతాధికారులకు నివేదిక
- గోపాలపట్నం తహసీల్దార్ రమేష్



విశాఖవిద్య: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలిస్తున్నట్లు గోపాలపట్నం తహసీల్దార్ చావలి వెంకట రమేష్ అన్నారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన వివరాలను తెలిపారు. ప్రజలు తహసీల్దార్ కార్యాలయం వరకు రావాల్సిన అవసరం లేకుండా సచివాలయ స్థాయిలోనే సమస్యకు పరిష్కారం చూపేలా సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం గోపాలపట్నం మండలంలో తొమ్మిది చోట్ల రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. సదస్సుల్లో ప్రజానీకం అందజేసిన ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 591 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, 234 దరఖాస్తులను పరిశీలించినట్టు చెప్పారు. అత్యధికంగా 550 వరకు దరఖాస్తులు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని, అదేవిధంగా పట్టాల్లో పేరు మార్పు చేయాలని వచ్చాయన్నారు. వీటిలో వాస్తవికతను ధృవీకరించేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది సమగ్ర పరిశీలన చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిషేధిత(22/ఏ) జాబితాలో ఉన్న భూమి నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని 8 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని సమగ్ర పరిశీలన చేసి కచ్చితమైన రిపోర్ట్ ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. రెవెన్యూ రికార్డుల మేరకు ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అలాగే పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటికి పరిష్కారం చూపేలా శ్రద్ధతీసుకుంటున్నామన్నారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా!

సేవా మార్గంలో వ్యర్థాల డంపింగ్



జవహర్‌నగర్ సేవా మార్గంలో వేసిన చెత్తలో పశువుల సంచారం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు జవహర్‌నగర్ సేవా మార్గం డంపింగ్ యార్డ్‌ను తలపించే విధంగా ఉంది. కాలనీ వాసులు ఇళ్లలోవ్యర్థాలను ఇలా రోడ్డుపై నిర్లక్ష్యంగా డంప్ చేస్తున్నారు. వీటిని సకాలంలో ఆ ప్రాంత పారిశుధ్య కార్మికులు తొలగించకపోవడంతో వాటిపై పందులు, మూగజీవాలు చేరి పరిసరాలను మరింత అధ్వానంగా మార్చుతున్నాయి. ఇలాంటి వారిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

శ్యామ్ బెనగల్‌కు కళాసేవా పీఠం ఘన నివాళి



శ్యామ్ బెనగల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గోపాలపట్నం కళాసేవా పీఠం సభ్యులు

గోపాలపట్నం: ప్రముఖ సినీ దర్శకుడు శ్యామ్ బెనగల్‌కు గోపాలపట్నం కళాసేవాపీఠం సభ్యులు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు కళాసేవా పీఠం కార్యాలయంలో శ్యామ్ బెనగల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గౌరపల్లి బంగారాజు మాట్లాడుతూ శ్యామ్ బెనగల్ దేశం గర్వించే విధంగా తన దర్శకత్వంలో సినిమాలు చిత్రీకరించారని కొనియాడారు. ఆయన చిత్రాలు అందరినీ ఆలోచింపజేశాయని తెలిపారు. కార్యక్రమంలో కళాసేవాపీఠం వ్యవస్థాపకుడు నందవరపు సోములు, ప్రధాన కార్యదర్శి కొంతం నూకేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు చందు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మురుగుపోయే దారేది?



చిన్న ములగాడ విలేజ్ ప్రాంతంలో కాలువలేక నిలిచిన మురుగు నీరు



కాలువకు అడ్డంగా గోడ నిర్మించడంతో నిలిచిన మురుగు

- కాలువలకు అడ్డంగా గోడల నిర్మాణం
- కన్నెత్తి చూడని అధికారులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు చిన్న ములగాడ శివారు ప్రాంతంలో కాలువలు లేవు.దీంతో మురుగు నీరు పోయే దారి లేక ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోతుంది.దీంతో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. గ్రామంలో ప్రజలు వాడే నీరు గెడ్డలో కలుస్తుంది. ఆ గెడ్డ ద్వారా సముద్రంలో కలుస్తాయి.అయితే గ్రామంలో శివారు ప్రాంతాల్లో కొన్ని చోట్ల ఇప్పటికీ కాలువలు నిర్మించలేదు. దీంతో ఆ ప్రాంత వాసులు వాడే నీరు పోయే దారి లేక రోడ్డుపై నిలిచిపోతుంది. మరి కొన్ని చోట్ల కాలువలు ఉన్నా అక్కడ ఇళ్లు నిర్మించుకున్న వారు గోడలను కాలువలపై నిర్మించడంతో మురుగు నీరు పోయే దారి ఉండడం లేదు.దీంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యపై అధికారులు స్పందించాలని చిన్న ములగాడ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నేడు ఉక్కు ఉద్యోగుల చలో కలెక్టరేట్



వడ్లపూడి నిర్వాసితకాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉక్కు కార్మిక సంఘాలు, నిర్వాసితులు



అగనంపూడి నిర్వాసితకాలనీల్లో..

విజయవంతం చేయాలని నేతల పిలుపు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని డిమాండ్‌తో సోమవారం నిర్వహించనున్న చలో కలెక్టరేట్ బైక్ ర్యాలీ విజయవంతం చేయాలని కోరుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వడ్లపూడి నిర్వాసితకాలనీలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ విశాఖ పర్యటన సందర్భంగా విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేస్తున్నామని ప్రకటించాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్‌తో నిర్వహించనున్న ర్యాలీలో నిర్వాసితులు, కార్మికులు, మద్దతుదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్, నాయకులు నీరుకొండ రామచంద్రరావు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, విజయరామరాజు, ఎన్నేటి రమణ పాల్గొన్నారు.

- విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేసే వరకూ పోరాటం ఆగదని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు కె.సత్యనారాయణరావు అన్నారు. సోమవారం చేపట్టనున్న చలో కలెక్టరేట్ బైక్‌ర్యాలీని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తూ అగనంపూడి నిర్వాసితకాలనీల్లో ప్రచార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రమణమూర్తి, పెదిరెడ్ల నీలకంఠం, కరణం పైడిరాజు, బలిరెడ్డి సత్యనారాయణ, శీరంశెట్టి గోవిందరావు, కొలిపాక అప్పారావు, పట్టా రమేష్, చిత్తా అబ్బాయి పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు



తుడుము మేళం వాయిస్తున్న కళాకారులు

ఆరిలోవ: ఆరిలోవలో ఆదివారం సంక్రాంతి సంబరాలు సందడిగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర సంగీత జానపద కళాపీఠం ఆధ్వర్యంలో ఆరిలోవ ప్రాంతం టీబీసీ పాయింట్ వద్ద సాయంత్రం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు రెట్టి భగవాన్‌దాస్, పీఠం కమిటీ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్రలో పలు ప్రాంతాలకు చెందిన కళాకారులను ఇక్కడకు తీసుకువచ్చారు. ఆరిలోవ కాలనీ నుంచి దుర్గాబజార్, టీబీసీ పాయింట్, బాలాజీనగర్, తోటగరువు, రవీంద్రనగర్, పెదగదిలి, చినగదిలి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో జనం రావడంతో వారం కు ముందే సంక్రాంతి వచ్చినట్లయింది. కూచిపూడి, భరతనాట్యం, కోలాటం, ఏకపాత్రాభినయం, గిరిజన కోలాటం, థింసా నృత్యం, జముకుల కథ, సన్నాయి మేళం, రాజమ్మ ఆట, నాగిని డ్యాన్స్, తుడుము మేళం, ఒడిశా గిరిజన సంస్కృతి, చెంచు నాటకం, జానపద పాటలు, జానపద నృత్యాలు, గొల్ల పాటలు, సామాజిక పాటలు తదితర కళలను విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాపీఠం కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు కళాకారులను సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని ప్రకటన చేయాలి




పెదగంట్యాడలో మహాపాదయాత్ర చేస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

పెదగంట్యాడ: ఈ నెల 8న విశాఖ వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్ విలీనం చేస్తామని ప్రకటించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పెదగంట్యాడ జంక్షన్ నుంచి నడుపూరు గాంధీ విగ్రహం వరకూ ఆదివారం మహాపాదయాత్ర నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ గొందేశి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్ర పెదగంట్యాడ జంక్షన్ నుంచి దుర్గవానిపాలెం, చిన కొరాడ, నెల్లిముక్కు, బాలచెరువు, సీతానగరం మీదుగా నడుపూరు గాంధీ విగ్రహం వరకూ సాగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు, కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎస్.రామారావు, అనిపెద్ది మసేనురావు, రామస్వామి, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కూటమి రంగు బయట పడింది

వైఎస్సార్‌టీయూ ప్రధాన కార్యదర్శి పిట్టారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి పిట్టా రెడ్డి

అగనంపూడి: అధికారంలోకి వచ్చిన ఆరుమాసాల్లో కూటమి ప్రభుత్వం అసలు స్వరూపం బయటపడిందని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి పిట్టా రెడ్డి అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరంలో ఆదివారం వారు మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ అధికారం ఇస్తే ప్రైవేటీకరణ అడ్డుకుంటామని చెప్పి నేడు కనీసం నోరుమెదపకపోవడంతో వీరి బాగోతం ప్రజలకు అర్థం అయిందన్నారు. ఇటీవల ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు విశాఖ ఉక్కును పరిరక్షించాలని కోరడం మానేసి మిట్టల్ నిర్మిస్తున్న స్టీల్‌ప్లాంట్‌కు లైసెన్స్, ఇనుప గనులు కేటాయించాలని ప్రధాని మోదీని కోరడం దారుణమన్నారు. ఉత్తరాంధ్ర విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని ప్రకటించే వరకు విశాఖలో అడుగు పెట్టే హక్కు ప్రధానికి లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, పరంధామయ్య, గొందేశి ప్రభాకర్ రెడ్డి, మద్ది అప్పలరాజు, బైరెడ్డి అప్పలరెడ్డి, గొందేశి మంగరాజు, బీఎంకె రాజు, అప్పారావు, సత్యనారాయణ, గోవింద్, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టోరీ టెల్లింగ్

సీతంపేట : విశాఖపట్నం పౌర గ్రంథాలయం, భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్ సంయుక్తంగా లైబ్రరీ మియావాకీ సెంటర్‌లో నిర్వహించిన స్టోరీ టెల్లింగ్ కార్యక్రమం చిన్నారులను ఆకట్టుకునేలా ఉత్సాహంగా సాగింది. చందమామ కథ వ్యవస్థాపకురాలు శ్రీకరుణ ఆకర్షణీయమైన కథలు, సృజనాత్మక అంశాలతో పిల్లలను ఉర్రూత లూగించారు. 'ది హ్యాట్ సెల్లర్ అండ్ ది మంకీస్' కథను, పంచతంత్రంలోని 'ఒక కాలం' కథను టాయ్స్‌తో చక్కగా వివరించారు. అలాగే మంచితనం యొక్క బలం, స్నేహం, సమస్యల నుంచి పరిష్కారం కనుగొనే 'ది బేబీ ఎలిఫెంట్ అండ్ ది బన్నీ రాబిట్' నీతి కథను బోధించారు. పిల్లలను ఆకట్టుకునేలా తోలు బొమ్మలు, టోపీలు ఉపయోగించి సృజనాత్మకంగా కథలు బోధించారు.

అలరించిన వినోదాల విందు



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న క్లబ్ కళాకారులు

సీతంపేట : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం వినోదాల విందు పేరిట నిర్వహించిన కామెడీ స్కిట్స్ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో కళాకారులు జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, నాయుడు, పోర్ట్ శేషు, ఇమంది ఈశ్వరరావు, రమేష్, శివ జ్యోతి, సీత, వెంకటేశ్వరరావు, పుష్యమి, సంధ్యా ప్రియదర్శిని ప్రదర్శించిన స్కిట్స్, చెప్పిన జోక్స్ కడుపుబ్బా నవ్వించాయి. వీటిలో జ్యోతి ప్రజ్వలన, అకౌంటెంట్ పోస్టు, ఎస్ఐ కానిస్టేబుల్, సుబ్బారావు పెళ్లి, సన్మానం, డాక్టర్ పేషెంట్, అమ్మాయి చుట్టూ, బెల్లియం అద్దం, మూడు మాత్రలు, పెళ్లి చూపులు, సేవ్ ఫుడ్ కామెడీ స్కిట్స్ నవ్వులు పండించాయి. ముందుగా హరిహర నృత్య నికేతన్ డ్యాన్స్ స్కూల్ విద్యార్థులు అనూష, అనన్య, శరణ్య ప్రదర్శించిన క్లాసికల్ డ్యాన్స్ అలరించింది. కార్యక్రమంలో తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, వి.వి.కృష్ణంరాజు, మాల్యాద్రి, శివకుమార్ కళాకారులను సత్కరించారు.